విద్యార్థుల నృత్య ప్రదర్శనలు భళా...
భరతనాట్యంలో అద్భుత ప్రదర్శన

విశాలాంధ్ర - ఆనందపురం : మండలంలో భీమిలి క్రాస్ రోడ్ వద్ద వేములవలస సత్య కళ్యాణ్ అపార్ట్మెంట్లో భరతనాట్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు విజయనగరం పైడితల్లమ్మ ఉత్సవాలలో పాల్గొని నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆనంద గజపతి ఆడిటోరియంలో శ్రీ ప్రసన్న నృత్య కళ నికేతన్ విజయనగరం, ఆనందపురం విద్యార్థుల నృత్య ప్రదర్శన ప్రేక్షకులకు క అందరిని ఆకట్టుకునే విధంగా చేశారనీ భరతనాట్యం గురువు ఇబ్రహీం ఖాన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టుకు సీపీఐ నాయకులు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - పెందుర్తి : గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ జర్నలిస్ట్ గరికన ఈశ్వరరావుకు సిపిఐ నాయకులు ఆపన్న హస్తమందించారు. జర్నలిస్టు సంఘాల ద్వారా ఈశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు వై. రాంబాబులు అతని ఇంటికి వెళ్లి 5వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే జర్నలిస్టులు తరచూ అనారోగ్యం పాలవడం బాధాకరమని, వారికోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా అంతంతమాత్రంగా ఉండే పాత్రికేయులకు గౌరవ వేతనం, పెన్షన్ వంటి పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించే జర్నలిస్టుల పట్ల గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. కాగా ఈశ్వరరావు ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్న కమ్యూనిస్టు నాయకులు తాము తోడుగా ఉన్నామని అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. అయితే రానున్న పది రోజుల్లో ఆపరేషన్ చేయడానికి సిద్ధం చేశారని... ఆపరేషన్ కి సుమారు 5 లక్షల రూపాయల ఖర్చు అవుతుందని ఈశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు సహాయ సహకారాలు అందించిన జర్నలిస్ట్ సోదరులకు రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నేతలకు, అధికారులకు అతను ధన్యవాదాలు తెలిపారు. ఈశ్వర్ కీ ఆర్థికంగా సహాయం అందించాలనుకున్నవారు ఆయన తమ్ముడు గరికిన రాజు 98858 53547 ఫోన్ పే నెంబరుకు సాయం చేయవలసిందిగా జర్నలిస్టు సంఘాల నాయకులు వాల్మీకి నాగరాజు, దూది వెంకట్ కోరారు.

మద్యం దుకాణాల లాటరీకి వేళాయే...

నేడు వుడా చిల్డ్రన్ థియేటర్లో ఉదయం 8 గంటలకే లాటరీ ప్రారంభం....

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ప్రైవేటు మద్యం వ్యాపారం కోసం ఎంతో ఆశపడి షాపుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు తీవ్ర ఉత్కంఠతో తమ షాపుల కేటాయింపు కోసం ఎదురుచూస్తున్నారు. నేడు ఉదయం ఎనిమిది గంటలకు సిరిపురం వుడా చిల్డ్రన్ థియేటర్ లో లాటరీ ద్వారా షాపులు ఎక్సైజ్ శాఖ అధికారులు కేటాయించనున్నారు. ప్రైవేటు మద్యం దుకాణాలకు లాటరీ ద్వారా షాపులు కేటాయించ నున్నామని డిప్యూటీ కమిషనర్ డి. శ్రీరామ చంద్రమూర్తి తెలిపారు. తెలియజేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న మొత్తం 331 దుకాణాలకు సగటున ఒక్కో దుకాణానికి 25 దరఖాస్తులు వచ్చాయి. విశాఖ జిల్లాలో 155 మద్యం దుకాణాలకు 3923 దరఖాస్తులు వచ్చాయి. ప్రైవేటు మద్యం దుకాణాల టెండర్లకు విశాఖ జిల్లాలో ఒక దుకాణానికి సగటున 25 దరఖాస్తులొచ్చాయి. దీనికి ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు కారణమా, లేక వ్యాపారుల్లో ఆసక్తి లేకపోవడమో తెలియదు గాని అనుకున్న దాని కంటే కాస్త తక్కువగా దరఖాస్తులు వచ్చాయి. విశాఖ, అనకాపల్లి జిల్లాలు అభివృద్ధితో పాటు, ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాలు. ఈ ప్రాంతాల్లో ఒక్కో దుకాణానికి 30 నుంచి 35 దరఖాస్తులు కచ్చితంగా వస్తాయని ఎక్సైజ్ శాఖ అధికారులు భావించారు. అయితే ఆ స్థాయిలో దరఖాస్తులు రాకపోగా కొన్ని చోట్ల కూటమి నాయకులు సిండికేట్ గా మారడంతో, దరఖాస్తులు వేయకుండా అడ్డుకున్నారనే ఆరోపణలున్నాయి. విశాఖ, అనకాపల్లి ప్రాంతాల్లో మద్యం దుకాణాలకు సంబంధించి కూటమి నాయకులు, వారి బంధువులు జోక్యం చేసుకోవద్దని నేరుగా సీఎం స్పష్టం చేసినప్పటికీ, కొంత మంది కూటమి ఎమ్మెల్యేలు పలువురిని అడ్డుకోవడం జరిగింది. దీంతో అనుకున్నదాని కంటే తక్కువగా దరఖాస్తులు వచ్చాయి. తక్కువగా దుకాణాలున్న అల్లూరి జిల్లాలో ఓ మాదిరిగా దరఖాస్తులు వచ్చాయి. 40 దుకాణాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంతో మొత్తం 1196 దరఖాస్తులు వచ్చాయి. ఒక దుకాణానికి సగటున 30 దరఖాస్తులు వచ్చాయి. అల్లూరి జిల్లలో ఉన్న తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన చింతూరు, రంపచోడవరంలో తెలంగాణ నుంచి వచ్చిన వ్యాపారులు పెద్దఎత్తున దరఖాస్తులు చేశారు. ఈ జిల్లాలో 36 నెంబర్ షాపునకు అత్యధికరంగా 70, 37వ నెంబరు షాపునకు 67 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రంలో అతి విశాఖ జిల్లాలో మద్యం దుకాణాల కోసం 8336 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. దీంతో తిరిగి ఇవ్వని రుసుముల రూపంలో ప్రభుత్వానికి 5. 166. 725 ఆదాయం సమకూరింది. అయితే లాటరీలో కూడా ప్రభుత్వం తమ వారికే పెద్దపీట వేస్తుందన్న అనుమానాలు కొంతమందిలో వ్యక్తం అవుతున్నాయి. ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు సిఫార్సుల మేరకే లాటరీ ఎంపిక సాగుతుందని ప్రచారం సాగుతుంది.

గీతం దూర విద్య కోర్సులలో అడ్మిషన్లు

విశాలాంధ్ర - మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఓఈ) ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో ఎమ్.ఎ ఇంగ్లీష్ మరియు బిఎ, బికామ్ డిగ్రీ కోర్సులలో 2024 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సిడిఓఈ డైరక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఇంటి వద్ద నుంచి దూర విద్యా విధానంలో ఈ కోర్సులను అభ్యసించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు ఆయన వెల్లడించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశ ధరఖాస్తు తేదీలను పొడిగించినట్లు ఆయన తెలిపారు. పూర్తి చేసిన ధరఖాస్తులను నవంబర్ 15వ తేదీలోగా అందజేయవలసి ఉంటుందన్నారు. పూర్తి సమాచారం దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాల్సిందిగా సూచించారు. ఆన్‌లైన్ ధరఖాస్తుల కోసం cdl.gitam.edu వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా సూచించారు.

దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గణబాబు

విశాలాంధ్ర - మల్కాపురం : పారిశ్రామిక ప్రాంత పరిధిలో దసరా ఉత్సవాల్లో భాగంగా కొత్త నక్కవాను పాలెం ప్రాంతంలో ఏర్పాటు చేసింది దుర్గాదేవి విగ్రహా న్ని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణ బాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు భవానీ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు లో ఘనంగా దసరా ఉత్సవం

విశాలాంధ్ర - పెదగంట్యాడ : విశాఖపట్నం స్టీలు ప్లాంట్ లో శనివారం దసరా పూజలు కార్మికులు ఘనంగా నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ కార్మికులకు వేతనాలు, దసరా బోనస్ అందకపోయినా దుర్గాదేవి అమ్మవారి మీద ఉన్న భక్తితో ఘనంగా పూజలు అర్పించారు. కోకోవెన్ ఇన్స్ట్రుమెంటేషన్ విభాగం లో జరిగిన ఈ పూజ కార్యక్రమం లో అధికారులు, ఉద్యోగులు పాల్గొని మాట్లాడుతు ఈ దసరా పండుగ నుండి స్టీల్ ప్లాంట్ అభివృద్ధి బాటలో నడవాలి అని కార్మికుల జీవితాలు ఆశాజనకంగా ఉండేలా దీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమం లో స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘల నాయకులు యేల్లేటి శ్రీనివాసరావు, కె శ్రీరామచంద్ర రావు, చీకటి శ్రీను, కోగంటి లెనిన్ బాబు, వెన్న శ్రీరామమూర్తి, ఉప్పిలి రామకృష్ణ,, మొండి సత్యనారాయణ, ఎ తవిటయ్య అప్పారావు బాబ్జి, బంగారాజు లతో పాటు ఉక్కు అధికారులు భీష్మరామ్, శేషగిరి, కనకరాజు, కిరణ్ కుమార్, భగత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ గిఫ్టింగ్ స్టోర్ పై 134 శాతం వృద్ధి నమోదు చేసిన అమేజాన్ బిజినెస్

విశాలాంధ్ర - విశాఖపట్నం : అమెజాన్ బిజినెస్ ప్రారంభించిన ప్రత్యేకమైన కార్పొరేట్ గిఫ్టింగ్ స్టోర్ 134 శాతం వృద్ధిని సాధించిందని అమేజాన్ బిజినెస్ డైరెక్టర్ సుచిత్ సుభాస్ తెలిపారు. ఇది భారతదేశపు ప్రముఖ బి2బి ఆన్ లైన్ మార్కెట్ ప్రదేశం అని, ఇది 8,500కి పైగా జీఎస్టీ ప్రారంభించబడిన ఉత్పత్తులను ప్రదర్శిస్తుందన్నారు. విస్తృత శ్రేణి బహుమతుల ఆప్షన్స్ తో, మిక్సర్ గ్రైండర్లతో శక్తివంతంగా అనుగుణ్యతను కలిగి ఉందని, జ్యూసర్స్ అత్యంత బహుమానపూర్వకమైన వస్తువులుగా 5.5 ఎక్స్, వైట వై వృద్ధిని సాధించాయన్నారు. తదుపరి కుకర్స్ వంటి ఇతర కిచెన్ వేర్ వంటివి 3 రేట్ల వృద్ధిని సాధించాయన్నారు. పండగ సీజన్ లో మా కార్పొరేట్ గిఫ్టింగ్ స్టోర్ యొక్క గొప్ప అభివృద్ధి భారతదేశం వ్యాప్తంగా ఇ-సేకరణను వేగంగా అనుసరించడాన్ని సూచిస్తోందన్నారు.

ఘనంగా జమ్మి వేట ఉత్సవం...

విశాలాంధ్ర - సింహాచలం : పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం విజయదశమి పర్వదినం సందర్భంగా కొండదిగువ పూలతోటలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి శమీపూజా (జమ్మివేట) మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. శమీ దళాలతో అర్చక పెద్దలు వరాహ నారసింహుడ్ని అర్చించారు. సింహాచలేశుడు శ్రీరాముడి అలంకారంలో భక్తకోటికి తన దివ్య దర్శన భాగ్యం కల్పించారు. నగర ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించు కున్నారు. దేవస్థానం ఈవో వి.త్రినాధరావు వీరికి స్వాగతం పలికి మర్యాదలు చేసారు. జమ్మివేట విశిష్టతను ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, స్థానాచారులు వివరిస్తూ రామావతారంలో స్వామి దర్శనం, చెడుపై మంచి విజయం కోసం జమ్మి చెట్టును పూజించి దాని చుట్టూ ప్రదక్షిణలు చేస్తే విజయం సాధిస్తారని నమ్మకం. పాండవుల వనవాస సమయంలో జమ్మిచెట్టుపై ఆయుధాలు దాచి వనవాసం పూర్తి చేసుకొని కౌరవులపై విజయం సాధించారు. శ్రీ రాములవారు సీత జాడ కోసం జమ్మిచెట్టుకు పూజలు చేసి సీతమ్మ జాడ ను తెలుసుకున్నారు ఈ సందర్భంగా పూలతోటలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవం అనంతరం సింహాచలేశుడు అశ్వ వాహనంపై అడివివరం పురవీధులో ఊరేగారు. ప్రముఖ సినీ సీనియర్ నటుడు సాయికుమార్ స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రకృతి సమతుల్యతలను చెడగొట్టడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ నిన్న (అక్టోబర్ 13) అంతర్జాతీయ ప్రకృతి వైపరీత్యాల నివారణ దినోత్సవం సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యతలను చెడగొట్టడం వల్ల ప్రకృతి వైపరిత్యాలు జరుగుతున్నాయని పరిశోధనల్లో శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. కావున వాయు కాలుష్యం వల్ల చాలా మంది అనారోగ్యానికి గురి అగుచున్నారు. మనిషి ఆయుష్యుని తగ్గిస్తున్న కాలుష్యం, పర్యావరణం పరిరక్షణపై ప్రజల్లో విసృతమైన చర్చ జరగాలి. పర్యావరణ పరిరక్షణ శాలుష్య నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేసి మన ఆరోగ్యాలను మనమే కాపాడుకోవాలని, ప్రకృతి వైపరిత్యాలను జరగకుండా పర్యావరణాన్ని కాపాడుకోవలసిన అవస్యకత ఎంతైన ఉన్నదని, రాబోయే తరాలకు కూడ కొంత మేలు చెయ్యవలసిన భాద్యత మనపై ఉందని మనలో ఎంత మందికి తెలుసు. ప్రకృతి అనునది భూమిపై ఉన్న ఒక గొప్ప వనరు. ప్రకృతి అను అంశం లో గాలి, నీరు , చెట్లు జంతువులు నిర్జీవ అంశాలు మిళితమై ఉన్నాయి. ఈ అంశాలన్ని ఒక దానిపై ఒకటి అధారపడి ఉన్నాయి. కొన్ని సందర్భాలలో ప్రకృతి లో జరిగే పెను మార్పు వల్ల తుఫానులు, వరదలు, భూకంపాలు సంభవించి ప్రాణ అస్థి నష్టాలకు దారి తీస్తున్నాయి. సముద్రాల లో భూకంపాలు సంభవించి సునామి లాంటి పెను విపత్తులు వస్తున్నాయి. సునామి ద్వార తీర ప్రాంత ప్రజలు చాలా నష్టపోతారు. ప్రపంచమంతటా ఏన్నో రకాలైన పర్యావరణ విపత్తులు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా మానవుడు పర్యావరణానికి చేయు నష్టాలు కూడ విపత్తులకు ఒక కారణం అన్నారు.

బుల్లెట్ ట్రైన్లు మాత్రమే అభివృద్ధి కాదు... నిత్యవసరాల ధరల అదుపు ముఖ్యం

పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు

విశాలాంధ్ర - పెందుర్తి : బుల్లెట్ ట్రైన్లు మాత్రమే అభివృద్ధి కాదు... పేద మధ్యతరగతి ప్రజలు బతికేందుకు వీలుగా నిత్యవసరవస్తులు ధరలను నియంత్రించడం కూడా ముఖ్యమని కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్, పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకట్రావు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిత్యవసర వస్తువులు ధరలు అందుబాటులో లేకపోవడంతో ఈ ఏడాది దసరా పండుగను సామాన్య పేద తరగతి ప్రజలు సరిగా జరుపుకోలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిత్యవసరాల ధరల పెరుగుదలపై దాదాపు 90 శాతం మంది ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, ధరలు ఇప్పుడే తగ్గవని 82 శాతం మంది ప్రజలు అభిప్రాయపడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం,గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేకపోవడం వలన ప్రజల కొనుగోలు శక్తి భారీగా తగ్గిపోయిందన్నారు. రాష్ట్రంలో ఆహార ధాన్యాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ బియ్యం,నిత్యావసర సరుకుల ధరలు అమాంతంగా పెరగడం వలన పేదల ఆదాయం మొత్తం ఆహార ధాన్యాలకే ఖర్చు చేయాల్సి వస్తుందని, ఇది పేద ప్రజల విద్య, వైద్యం వంటి అత్యవసరాలపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు అప్పులు భారంలో దేశంలోనే నెంబర్ వన్‌గా ఉన్నారని, రాష్ట్రంలో 18,ఏళ్ళు దాటిన ప్రతి లక్ష మందిలో సగటున 60వేల మందిపై అప్పుల భారం ఉందంటూ కేంద్ర ప్రభుత్వం చెబుతుండటం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఎన్నికలకు ముందు ఎన్డీఏ ప్రభుత్వం ధరలు అదుపు చేస్తామని,ఉచితంగా ఆహార ధాన్యాలు అందిస్తామని ఇచ్చిన హామీకి విరుద్ధంగా భారీగా నిధులు తగ్గించిందని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ధరలు అదుపు చేయడానికి, బ్లాక్ మార్కెట్ ను అరికట్టడానికి ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. పేదరికం 70 శాతం ఉన్న మనలాంటి రాష్ట్రంలో ఆహార ధాన్యాలు ఉచితంగా అందించడం ప్రభుత్వాల బాధ్యత అని మూల వెంకట్రావు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి తక్షణమే ఈ విషయంపై దృష్టి సారించి ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు.

నేటి రాజకీయాల్లో యువతతే ప్రధాన భూమిక

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి వెన్నంటి నడుస్తూ, పార్టీ అభివృద్ధికి విశిష్ట సేవలందించడంలో యువత ప్రధానపాత్ర పోషిస్తుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. భీమిలి నియోజకవర్గం నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి దౌలపల్లి హరీష్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గంటా నూకరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి యువత వెన్నెముకగా ఉంటుందని అన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలు చేయడంలో కీలకంగా ఉన్నారని అన్నారు. యువతకు టిడిపి అండగా ఉంటుందని, కూటమి ప్రభుత్వంలో అందరికి సమన్యాయం జరుగుతుందని అన్నారు. ఈరోజు జన్మదినం జరుపుకుంటున్న హరీష్ కుటుంబ సమేతంగా మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని, ఇంకా భవిష్యత్తులో ఎన్నో పదవులు పొంది అంచెలంచెలుగా ఎదగాలని గంటా నూకరాజు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీనాయకులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవకుమార్, వాడమొదలు సత్యారావు, జలగడుగుల మురళి, కొక్కిరి అప్పన్న, వియ్యపు పోతురాజు, కందుల సుందర్ రావు, రాజగిరి రమణ, కాసరపు ఎల్లాజీ, శంకర్, అన్వార్, అప్పికొండ నరసింగ్‌రావు మట్టా దాసు, జగన్నాదం, వెంకటరావు రామస్వామి పి విజయ్ చింతకాయల అశోక్, మూర్తి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన బతుకమ్మ సంబరాలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ : ఉక్కు నగరంలో ప్రతిష్టా త్మకంగా నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ఘనంగా ముగిసాయి. ఉక్కు తెలంగాణ ఉద్యో గుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ 2న, 6న , చివరిగా 10 న సద్దుల బతుకమ్మతో ఈ సంబరాలు ముగిసా యని సంఘం అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు ఎన్. కుమార స్వామి, జి.ఆనంద్ తెలిపారు . ప్రతి ఏడాది ఉక్కు నగరం లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఐతే ఈ ఏడాది మూడు రోజుల పాటు నిర్వహించామని అన్నారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ వేడుకలలో ఉక్కు తెలంగాణ ఉద్యోగుల కుటుంబాలు అధిక సంఖ్యలో పాల్గొని ఆట, పాటలతో సందడి చేసారని అన్నారు. ఈ వేడుకలకు ఉక్కు సీజీఎం (వర్క్స్) ఇంచార్జి యూ శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, గౌరవ అతిథులుగా జనరల్ మేనేజర్లు రవి శేఖర్, డా.ఏ.పి.నవీన్ కుమార్, ఎస్.వీరేశం, ఆచారి, కూర్మ న్న పాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎ. మురళీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.విడి ప్రసాద్‌లు హాజరై బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల నిర్వహణలో సంఘం ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, జి.మల్లేశం, టి.ప్రభాకర్, ఎన్.నర్సింగరావు, చంద్ర కిరణ్, పరమేశ్, ఎం.కెవిఆర్ మోహన్ రావు, ఎం.వేణుగోపాల్, ఎంచంద్ర శేఖర్, ఎ.శంకర్, సి.హెచ్.రవికుమార్, సంయుక్త కార్యదర్శి ఆర్.నరసింహ పాల్గొన్నారు.

నూకాంబికా ఆలయంలో జీవీఆర్ అన్నసంతర్పణ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఓల్డ్ సిటీ లోని కొబ్బరి తోటలో వెలసిన లలిత దుర్గా నూకాంబిక ఆలయంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు .శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన అన్న సంతర్పణ కార్యక్రమానికి మాజీ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు జివి రామచంద్రరావు ఆర్థిక సహాయం చేశారు .సుమారు 2000 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రరావు పాల్గొని స్వయంగా పేదలకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు టేకుమూడి లక్ష్మణ్, ఉమ్మడి గురుమూర్తి ఆచంట వేణు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా తెప్పోత్సవం

విశాలాంధ్ర - మల్కాపురం : దేవీ నవరాత్రుల మహోత్సవంలో భాగంగా షిప్ యార్డ్ పరిశ్రమ సమీపంలోని గల సాగర్ కనక దుర్గ ఆలయంలో నిర్వహించిన సరూర్ నవరాత్రి ఉత్సవాలలో ఆకలి రోజైనా ఆదివారం తపోత్స వాన్ని నిర్వహించారు. అమ్మవారి తపోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఉత్సాహంగా దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : కళా ప్రపూర్ణ జైపూర్ మహారాజు స్వర్గీయ విక్రమ్ దేవ్ వర్మ సంస్థానంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు వస్త్రాల పంపిణీ, అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. మహారాణి సారికాదేవి నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జైపూర్ ఎమ్మెల్యే తార ప్రసాద్ భానుపతి, జైపూర్ కలెక్టర్ వి. కీర్తి వాసం, సస్యా రెడ్డి, డిఐజి నితీష్ శేఖర్, ఎస్పి, రోహిత్ వర్మ, జైపూర్ అధికారులు అంకిత్ వర్మ నరేంద్ర మహంతి, కిషన్ రాథోడ్ స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎన్నడూ లేనంత విధంగా ఎండలు.. భానుడు భగభగ

వేసవి తలపిస్తున్న ఎండలు లబోదిబోమంటున్న ప్రజలు

విశాలాంధ్ర - ఆనందపురం : ఎప్పుడు లేని విధంగా ఈ ఏడాది ఎండలు బోరా అనిపిస్తున్నాయి.దసరా నాటికి కొంతమేర ఎండల నుండి ప్రజలు సేద తీరుతారు కానీ ఈ ఏడాది ఎండలు రోజురోజుకి మరింత తీవ్రంగా పెరిగిపోతున్నాయి. వేసవి కాలాన్ని తలదన్నే విధంగా 30 నుండి 40లీ వరకు ఎండ తీవ్రత రోజుకి ఎక్కువవుతుంది ఈ కాలంలో ఎండ తీవ్రత తగ్గుముఖంగా ఉంటుంది కానీ అందుకు వాతావరణ మార్పులు అందుకు భిన్నంగా ఉండటం వల్ల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వరి మొనలు నాటిన తర్వాత దసరా నాటికి చేనుగా తయారవుతుంది దానికి కొంతమేర చల్లదనం ఉండాలి కానీ ఎండలు ఎక్కువ అవ్వడం వల్ల వరి పంటలకు ప్రకృతి సహకరించలేదని, అలాగే మెట్టులో పండిస్తున్న కాయగూరలు పంటలకు కూడా ప్రకృతి సహక రించడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఇలాంటి ఎండలు మునుపెన్నడు చూడలేదని వాళ్ళ భావాన్ని తెలియజేశారు.

సర్కారు స్థలాలు కబ్జా

- మార్కెట్ విలువ సుమారు రూ.3 కోట్లు - ఎకరా స్థలానికి పైగా ఆక్రమణ

- ముచ్చర్ల లో కొండ స్థలాలను కూడా వదలని అక్రమార్కులు - చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు, నాయకులు

విశాలాంధ్ర - ఆనందపురం : మండలంలో ముచ్చర్ల గ్రామపంచాయతీలు ప్రభుత్వ స్థలాలను ఇష్టానుసారంగా ఆక్రమించు కొని చిన్నచిన్న రేకుల షెడ్ల నిర్మాణాలు చేపట్టి స్వాధీనం స్థలాలను చేసుకుంటున్నారు. ఇందులో కొంతమంది స్థలాలకు రక్షణగా కర్రలతో హద్దులు కూడా వేసేసారు, అందులో కొన్ని షెడ్‌లలో వాహనాలు పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. సుమారు 100 సెంట్లు కొండ స్థలంలో పూర్తిగా గ్రావెల్ తరలించి ఇష్టానుసారంగా ఆక్రమణలు చేపట్టారు. దీని విలువ సుమారుగా3 కోట్లు వరకు ఉంటుందని అంచనా, ఇంత జరిగిన సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని వాదనైతే బలంగా వినిపిస్తుంది. ఇష్టాను సారంగా కొండను చదునుగా చేసి భారీ షెడ్లు నిర్మాణాలు చేపట్టారు అందులో కొంతమేర వాహనాలు పార్కింగ్కు మిగతాది స్థలాలను వాళ్ళ ఆధీనంలో తెచ్చు కుంటున్నారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం నేరమని స్థానిక ప్రజలు వాపోతున్నారు ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వ స్థలాల్లో ఉన్న అక్రమార్కులను ఖాళీ చేసి సర్కారు భూమిని స్వాధీన పరుచుకోవాలని స్థానిక ప్రజలు వాపోతున్నారు.